సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం : 11 : మార్చి : 2024



ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

యాదాద్రి శ్రీపర్వత వర్ధిని నమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. - 8లో



లక్ష్మీనారసింహుడికి పట్టు వస్త్రాలు

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. - 8లో



అనుమతి పేరిట అక్రమాలు

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పేరిట ఇసుకకోసం అనుమతి పొందిన అక్రమార్కులు.. దందా చేస్తున్నారు. - 9లో

న్యూస్‌రీల్

రామన్నపేటలో ఆగనున్న రేపల్లె ఎక్స్‌ప్రెస్

రామన్నపేట : రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 13నుంచి రామన్నపేటలో స్టేషన్‌లో ఆగనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటలో ఆగని రైళ్లు శీర్షికన ఫిబ్రవరి 21వ తేదీన సాక్షిలో ప్రచురించిన కథనానికి రైల్వే అధికారులు స్పందించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రైల్వేశాఖ నిర్ణయంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీ నేతన్న యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన టీ నేతన్న యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీ నేతన్న యాప్‌లో ఇప్పటి వరకు 4,762 మంది చేనేత కార్మికులు, 4,147 మంది అనుబంధ కార్మికుల పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. జిల్లాలోని చేనేత సహకార సంఘాల ద్వారా టెస్కో ఈ ఏడాది జనవరి వరకు రూ.7.12 కోట్ల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసిందన్నారు. అలాగే త్రిఫ్ట్ పథకం కింద 2021 అక్టోబర్ నుంచి 2023 సెప్టెంబర్ వరకు రూ.46 కోట్లు చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 41 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు చేనేత బీమా కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు విడుదల చేశామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాస్టల్ వార్డెన్‌కు ఐకాన్ పురస్కారం



రాజాలుబాయికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

రామన్నపేట : రామన్నపేట బాలికల సాంఘిక సంక్షేమ వసతిగృహ అధికారిణి ధీరావత్ రాజాలుబాయికి 2024వ సంవత్సరానికి గాను ఉమెన్ ఐకాన్ పురస్కారం ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్లోబల్ పీస్ కల్చరల్ అసోషియేషన్ వారు పురస్కారం అందజేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి

సంస్థాన్ నారాయణపురం : మహిళలు హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం సంస్థాన్‌నారాయణపురం మండలంలో పుట్టపాక గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో అమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మహిళలు హక్కులను కాపాడటంలో విఫలం అయ్యాయని విమర్శించారు. మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. భవిష్యత్ పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ దోనూరి నిర్మల, ఎంపీటీసీ మర్రి వసంత నర్సిరెడ్డి, కేశిరెడ్డి జయమ్మ, దోంతగోని పెద్దులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షురాలుగా నడికుడి శైలజ, కార్యదర్శిగా కేసిరెడ్డి జయమ్మతో పాటు 25 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

వాహనాల తనిఖీ




తనిఖీలు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

భువనగిరి రూరల్ : భువనగిరి – నల్లగొండ ప్రధాన రహదారి బైపాస్ వద్ద, రాయగిరిలోని మోత్కూర్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఆదివారం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) తనిఖీలు నిర్వహించారు. ఏదైనా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని కోరారు. నేరాల నియంత్రణకు సహకరించాలన్నారు.

సీఎం గారూ.. నిధులివ్వండి





యాదాద్రి కొండ కింద నిలిచిపోయిన వివిధ పనులు

నిధుల లేమితో నిలిచిపోయిన యాదాద్రి అభివృద్ధి పనులు

- వసతులు లేక భక్తుల ఇబ్బందులు
- నిర్వాసితులకు అందని పరిహారం
- నేడు బ్రహ్మోత్సవాలకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఆశలు పెట్టుకున్న భక్తులు

సాక్షి, యాదాద్రి : యాదాద్రి అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. యాదాద్రి అలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం ఆయన రానున్నారు. సీఎం అయిన తర్వాత తొలిసారిగా యాదగిరిగుట్టకు వస్తుండడంతో వరాల జల్లు కురిపిస్తారన్న ఆశతో భక్తులు ఉన్నారు. రూ.1,200 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి కావడానికి ఇంకా రూ.150 కోట్ల వరకు అవసరం ఉన్నాయి. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. వైటీడీఏ ద్వారా యాదాద్రి అభివృద్ధి పనులను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. గత సంవత్సరం మార్చిలో ఆలయ ఉద్ఘాటన జరిగింది. రెండు సంవత్సరాలు కావస్తున్నా భక్తులకు సరైన వసతులు లేవు.

కొండపైన విశిష్టత కాపాడాలని..

భక్తులకు ఆధ్యాత్మిక విశిష్టత లేకుండా పోయింది. కొండపైన దీక్షాపరుల మండపం, డార్మిటరీహాల్, విష్ణుపుష్కరిణి, కల్యాణకట్ట ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దీంతోపాటు ఆలయంలోపలికి వెళ్లి తిరిగి వచ్చే భక్తులు నిలువ నీడ, సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారులకు నష్టం

అవసరం లేకున్నా ఎక్కువ ఎత్తులో బ్రిడ్జి నిర్మించి యాదగిరిగుట్ట పట్టణాన్ని రెండుగా విడగొట్టి రూపురేఖలు లేకుండా చేశారని విమర్శలున్నాయి. దీని వల్ల వ్యాపారులు వీధిన పడ్డారు. స్థానికులు నష్టపోయారు. వీరి కోసం దేవస్థానం నిర్మించి ఇచ్చే షాపింగ్ కాంప్లెక్స్ పనులు కొనసాగుతున్నాయి.

ప్రారంభం కాని గెస్ట్ హౌస్‌లు

టెంపుల్ సిటీలో దాతల సహాయంతో చేపట్టాల్సిన గెస్ట్‌హౌస్‌ల నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదు. రూ.250 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేసిన లేఅవుట్ నిరుపయోగంగా ఉంది.

స్థానికులకు ఉపాధి దూరం

ఆలయ అభివృద్ధిలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం, ఇళ్ల స్థలాలు ఇంకా పూర్తిగా ఇవ్వలేదు. సైదాపురంలో కేటాయించిన స్థలాన్ని ఇంకా అభివృద్ధి చేయలేదు. ఇల్లు, భూములు కోల్పోయిన బాధితులకు సరైన నష్ట పరిహారం ఇవ్వడంలో, పునరావాసం కల్పించడంలోనూ జాప్యం జరుగుతోంది.

సగంలో నిలిచిన పనులు

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం అవుతోంది. ప్రస్తుతం చేసిన పనులకు పాత బిల్లులు రూ.70 కోట్ల వరకు, కొనసాగుతున్న పనులను పూర్తి చేయడానికి రూ.70 కోట్ల మేరకు అవసరం అవుతాయి. ఇందులో రూ. 60 కోట్ల మేరకు పనులకు చెక్‌లు ఇవ్వగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దేవస్థానం బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్, ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు మధ్యలో నిలిచిపోయాయి.గిరి ప్రదర్శన మార్గం పనులు సగభాగంలోనే నిలిచిపోయాయి.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు రూ.1.60లక్షల బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులందరికీ ఆహ్వాన పత్రికలు అందజేశామని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ 1500 మందికి అన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. రోజూ 15వేలకు పైగానే భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎదుర్కోలు, కల్యాణం, రథోత్సవం రోజుల్లో 30వేలకు పైగా భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. 70 మందికి పైగా ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు రానున్నారని స్పష్టం చేశారు. ఎంతమంది భక్తులు వచ్చినా కొరత రాకుండా లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, బస్సుల ఏర్పాటు తదితర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయంలో రోజూ నిర్వహించే ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ తదితరులు

యాదగిరీశుడికి బ్రహ్మోత్సవ శోభ



విద్యుత్ దీపాలంకరణలో ప్రధానాలయం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తీ వాచనం, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టనున్నారు. 21న అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో పరిసమాప్తి కానున్నాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను పాంచరాత్ర ఆగమ సిద్ధాంతానుసారంగా, సంప్రదాయ రీతిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు.

ఉత్తర మాడ వీధిలో కల్యాణం

ప్రధానాలయ ఉత్తర మాఢవీధిలో కల్యాణంనిర్వహించనున్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.3,000 చెల్లించి టికెట్ తీసుకోవాలి.

ప్రథమ ప్రాకారంలో సేవల అలంకరణ

అలంకార, వాహనసేవలు ప్రథమ ప్రాకారంలో నిర్వహిస్తారు. ఉత్తర దిశలో గల మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి సేవలను ఉత్తర రాజగోపురం నుంచి మాడవీధుల్లో ఊరేగిస్తారు. పశ్చిమ రాజగోపురం ఎదుట వేంచేపు మండపం వద్ద శ్రీస్వామి వారి అలంకార సేవను అధిష్టింపజేస్తారు. అలాగే 15నుంచి 21వ తేదీ వరకు ధార్మిక, సాహి త్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

షెడ్యూల్

- 11వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తీ వాచనం, రక్షాబంధనం, సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ.
- 12న ఉదయం 8గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11 గంటలకు ధ్వజారోహణంసాయంత్రం 6.30కి భేరీపూజ, దేవతాహ్వానం, హవన పూజలు
- 13న ఉదయం 9గంటలకు మత్స్యవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7గంటలకు శేష వాహన సేవ నిర్వహిస్తారు.
- 14న ఉదయం 9గంటలకు వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంస వాహన సేవ.
- 15న ఉదయం శ్రీకృష్ణ అలంకార సేవ, రాత్రి 7గంటలకు పొన్న వాహన సేవ.
- 16న ఉదయం గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి 7గంటలకు సింహ వాహన సేవ.
- 17న ఉదయం 9గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 8.45కు శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం.
- 18న ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై శ్రీస్వామివారి ఊరేగింపు, రాత్రి గజవాహన సేవ, శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణం నిర్వహిస్తారు.
- 19న ఉదయం శ్రీమహావిష్ణు అలంకార సేవలో గరుఢ వాహనంపై శ్రీస్వామివారి ఊరేగింపు, రాత్రి 8.45కు దివ్య విమాన రథోత్సవం.
- 20న ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, రాత్రి 7 గంటలకు శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం.
- 21న ఉదయం శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

ఆగమశాస్త్రం ప్రకారం ఉత్సవాలు



యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు పాంచరాత్ర ఆగమశాస్త్ర అనుసారంగా నిర్వహిస్తాం. శ్రీస్వామిని ఇష్టమైన అలంకార, వాహన సేవలు ఈ నెల 13వ తేదీన ప్రారంభం అవుతాయి. ప్రధాన ఘట్టాలైన ఎదుర్కోలు ఉత్సవం తూర్పు రాజగోపురం ముందు, కల్యాణం ఉత్తర మాఢ వీధిలో నిర్వహిస్తాం. రథోత్సవం రోజు శ్రీస్వామి వారు ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగుతారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలి.

– కాందూరి వెంకటాచార్యులు, ప్రధాన అర్చకులు

కుష్టు వ్యాధి కట్టడికి..

- నేటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- జిల్లాలో 1,82,122 గృహాలు



కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

భువనగిరి : కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా సోమవారం నుంచి జిల్లాలో కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాది ఆగస్టులో సర్వే నిర్వహించారు. అదే మాదిరిగా 2023 – 24 సంవత్సరానికి గాను నేటి నుంచి 24వ తేదీ వరకు సుమారు 14 రోజుల పాటు ఇంటింటి సర్వే చేయనున్నారు.

సర్వే కోసం 704 బృందాలు

జిల్లాలో మూడేళ్లుగా కుష్టు బాధితులు పెరుగుతున్నారు. వ్యాధి నిర్మూలన చర్యల్లో భాగంగా జనవరి 30నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తాజాగా నేటి నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. సర్వే చేయడానికి 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 704 బృందాలను ఏర్పాటు చేశారు.

రోజూ 20 నుంచి 25 గృహాల సర్వే

జిల్లాలో 1,82,122 గృహాలు, 8,23,952 జనాభా ఉంది. సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో బృందం రోజూ 20 నుంచి 25 వరకు, పట్టణాల్లో 25 నుంచి 30 గృహాల వరకు సర్వే చేయనున్నారు. పర్యవేక్షణకు 148 మంది సూపర్‌వైజర్లను నియమించారు. అనుమానితులను ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రతి నెలా ఉచితంగా మందులు అందజేయనున్నారు.

భువనగిరికి చేరిన అఖండజ్యోతి



భువనగిరిలో అఖండజ్యోతి యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

భువనగిరి : యాదాద్రి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో ప్రారంభమైన అఖండ జ్యోతి రథయాత్ర అదివారం రాత్రి భువనగిరికి చేరుకుంది. అఖండ జ్యోతి యాత్రకు హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు స్వాగతం పలికారు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖండ జ్యోతి రథయాత్ర చైర్మన్ వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, యాత్ర ఆర్గనైజర్ గండేశ్వర్ రావు,గడ్డం జ్ఞానప్రకాష్‌రెడ్డి, రోటరీక్లబ్ అధ్యక్షుడు పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, క్లబ్ పోర్ట్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు ఫక్కీర్ కొండల్ రెడ్డి, కోశాధికారి వేమూరి అశోక్, ఆకుల రమేష్, యాదగిరిగుట్ట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దీకొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో రసాయన జలాల శుద్ధి



నీటి శుద్ధి ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యే

- ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రామన్నపేట : కాలుష్య కారక రసాయన జలాలను శాస్త్రీయ పద్ధతుల ద్వారా శుద్ధి చేసి తిరిగి వినియోగించవచ్చని ఐఐసీటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రామన్నపేట మండలంలోని సిరిపురంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీస్ వారి రూ.2 కోట్ల ఆర్థిక సహకారంతో హైదరాబాద్ ఐఐసీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రసాయన, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి ఆదివారం కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహజసిద్ధంగా శుద్ధి చేసిన రసాయన నీటిని తిరిగి రంగుల అద్దకానికి, వ్యవసాయానికి ఉపయోగించ వచ్చన్నారు. రసాయన, మురుగునీటిని శుద్ధి చేయడానికి దేశంలోనే ప్రపథమంగా సిరిపురంను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, దశలవారీగా మిగిలిన ప్రాంతాలకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటిశుద్ధి వల్ల జల కాలుష్యంతోపాటు, నీటివృథా తగ్గుతుందన్నారు. ప్లాంట్ ఉపయోగంలోకి వస్తే దేశవ్యాప్తంగా సిరిపురం మోడల్‌గా నిలుస్తుందని, ఇక్కడ ఉత్పత్తయ్యే చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ పెరిగి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని వివరించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నీటి కాలుష్యంను తగ్గించడానికి ఐఐసీటీ వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గ్రామంలోని మురుగునీరంతా ఒకే చోటుకు వచ్చే విధంగా డ్రైన్ సిస్టం మెరుగుపరుస్తామని చెప్పారు. చేనేత కుటుంబాలు అధికంగా ఉండే వెల్లంకి, భూదాన్‌పోచంపల్లి, సిరిసిల్ల, బోగారం గ్రామాలకు ప్లాంట్‌లను విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్‌మోహన్, వైస్ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీ బడుగు రమేష్, తాజామాజీసర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్, సీనియర్‌సైంటిస్టులు డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ ఎస్.వెంకటమోహన్, డాక్టర్ ఎ.కిరణ్‌కుమార్, ప్రత్యేకఅధికారి బి.గాలయ్య, పంచాయతీ కార్యదర్శి జ్యోతి నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మేక అశోక్‌రెడ్డి, రాపోలు నర్సింహ, కట్ట దశరథరెడ్డి, అప్పం రామేశ్వరం, బండ శ్రీనివాస్‌రెడ్డి, అంబటి మల్లారెడ్డి, రాపోలు స్వామి, జెల్ల శ్రీనివాస్, దాసిరెడ్డి శ్రవణ్, కంకల మల్లేశం పాల్గొన్నారు.

ఖిలాపై కాషాయ జెండా ఎగురవేద్దాం

- బీజేపీ జాతీయ సంస్థాగత కార్యదర్శి సత్యకుమార్

భువనగిరి : లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై కాషాయ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ జాతీయ సంస్థాగత కార్యదర్శి సత్యకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరిలోని వైఎస్సార్ గార్డెన్‌లో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని, ప్రపంచ దేశాలు నేడు భారత్‌వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఏ ప్రధాని చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, అయోధ్యలో రామ మందిరం నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ రద్దు వంటి సంచలన నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డీఏకు 400 సీట్లు రావడం ఖాయమన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రపంచంలో భారత్‌ను శక్తివంతంగా తీర్చిదిద్దిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. నిరంతరం దేశ అభివృద్ధి కోసం పరితపిస్తున్న మోదీకి భువనగిరి ఎంపీ స్థానాన్ని గెలిచి కానుకగా ఇవ్వాలని కోరారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, భువనగిరి పార్లమెంట్ ప్రభారి పానుగంటి పాపారావు, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, వర్షిత్‌రెడ్డి, బోక్క నర్సింహారెడ్డి, పడాల శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్, చిత్రంలో బూర నర్సయ్యగౌడ్ తదితరులు

క్లుప్తంగా

మహిళలకు రక్షణ కరువు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నల్లగొండటౌన్: బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఆయన ఆదివారం డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చేయలేదన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మణిపూర్లో మహిళల పైన దాడులు దౌర్జన్యాలు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, గుండాల నరేష్, రామకృష్ణ ,సంతోష్ ,శేఖర్, రాము, శ్రావణ్ ,కిరణ్, కార్తీక్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఓ లారీ అదుపుతప్పి డివైడర్ ఎక్కి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి ప్రాంతం నుంచి పంచదార లోడ్‌తో లారీ ఒడిశాకు బయలుదేరింది. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విలేకరుల కాలనీ సమీపంలో డివైడర్ ఎక్కి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగిపోయింది. ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తెలిసింది. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్(ఫైల్)

తుర్కపల్లి: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం మోతీరాంతండాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ చందు, సునీత దంపతులకు ముగ్గురు సంతనం అందరిలో చిన్నవాడు బానోత్ ప్రవీణ్ (22) ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఇతను కొన్ని రోజుల నుంచి తండాలో క్యాటరింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. ప్రవీణ్ మధ్యాహ్న సమయంలో తండాలోనే ఉంటున్న స్నేహితుడి వద్దకు వెళ్లాడు. అతడి ఫోన్ తీసుకుని సెల్ఫీ తీసుకుని ఐ మిస్ యూ రా అని స్టేటస్ పెట్టాడు. అనంతరం మిత్రుడి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇచ్చి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఫోన్ రింగ్ అవుతున్నా ప్రవీణ్ లిఫ్ట్ చేయకపోవడంతో చుట్టు పక్కల వారు కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. లోపలికి వెళ్లి అతడిని కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

భార్య మృతిని తట్టుకోలేక..

- భర్త ఆత్మహత్యాయత్నం

భువనగిరి క్రైం : భార్య మృతుని తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన అడ్డగూడూరులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల జమాల్ కుతూరు భూమిక(19), ఇదే గ్రామానికి చెందిన బిట్కూరి వెంకటేశ్ కుమారుడు మనోహర్ ప్రేమించుకుని ఇటీవల వివాహం చేసుకున్నారు. కుటుంబంలో గొడవలు జరగడంతో ఇటీవల భూమిక పుట్టింటికి వెళ్లి ఈ నెల 7వ తేదీన ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు భూమిక మృతదేహాన్ని భర్త మనోహర్ ఇంటి ముందు ఉంచి ధర్నా నిర్వహించారు. అప్పటికే భయాందోళనతో మనోహర్, కుటుంబ సభ్యులు అడ్డగూడూరులో నివాసముంటున్న సోదరి ఇంటికి వెళ్లారు. భార్య మృతుని జీర్ణించుకోలేకపోయిన మనోహర్ శనివారం రాత్రి సోదరి ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని తిరుమలగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. చిమలకొండూరులో ఆదివారం పోలీస్ బందోబస్తు నడుమ భూమిక అంత్యక్రియలు పూర్తి చేశారు.

లక్ష్మీనారసింహుడికి పోచంపల్లి పట్టు వస్త్రాలు

- పూర్తయిన తయారీ ప్రక్రియ
- పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో నేడు ఆలయ అధికారులకు బహూకరణ


అమ్మవారికి బహూకరించనున్న చీరను తయారు చేస్తున్న చేనేత కళాకారుడు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి స్వామి, అమ్మవార్లకు బహూకరించేందుకు పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు తయారు చేయించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీటిని దేవస్థాన అధికారులకు అందజేయనున్నారు. ఏటా పోచంపల్లి మహాజన సంఘం ఆధ్వర్యంలో సనాతన ధర్మం ప్రకారం హరికి అత్తింటి వారు, సిరికి పుట్టింటి వారుగా పేరొందిన పద్మశాలి వశంస్తులు మి, అమ్మవార్లకు స్వయంగా పట్టువస్త్రాలను తయారు చేసి బహూకరిస్తున్నారు. 10 రోజులుగా పోచంపల్లిలో స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాల తయారీ ప్రక్రియను ఆదివారం రాత్రి పూర్తి చేశారు.

రెండు పట్టు చీరలు, పట్టుపంచెలు..

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి అమ్మవారిని అలంకరించేందుకు రెండు పట్టుచీరలను తయారు చేశారు. అందులో ఒకటి మెరుగు రంగు కొంగుతో కూడిన హాఫ్‌వైట్ చీర, మరొకటి మెరూన్ రంగు కలిగిన కొంగు, చిలుకపచ్చ చీరను తయారు చేశారు. చీరలో చతురస్రాకార రాజస్తాన్ డిజైన్లు కలిగి, స్పన్, జరీ బార్డర్‌తో చీరను నేశారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టు పంచె, పట్టు శాలువాను తయారు చేశారు.

పట్టు వస్త్రాలతో ప్రదర్శన

బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజున సోమవారం భూదాన్‌పోచంపల్లిలోని శ్రీ మార్కండేశ్వర స్వామి ఆలయంలో పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భారీ ప్రదర్శన ఊరేగింపుతో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వెళ్లి అధికారులకు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా శ్రీ మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నృసింహస్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

అదృష్టంగా భావిస్తున్నాం



పద్మశాలీల ఇలవేల్పు అయిన శ్రీ లక్ష్మీనారసింహస్వామి, అమ్మ వార్లకు ఎమిదేళ్లుగా పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను అందజేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ ఏడాది కూడా అమ్మవారికి రెండు ఇక్కత్‌పట్టుచీరలు, స్వామి వారికి పట్టుపంచె, శాలువా తయారు చేయించాం. సోమవారం పూజల అనంతరం ఊరేగింపుగా యాదాద్రి దేవస్థానానికి వెళ్లి పట్టు వస్త్రాలను బహూకరించనున్నాం.

– సీత శ్రీరాములు, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు

12 రోజుల్లో నేశాను



12 రోజుల్లో మగ్గంపై శ్రీ లక్ష్మీనారసింహస్వామి, అమ్మవారికి రెండు పట్టు చీరలు, స్వామి వారికి పట్టు పంచె, శాలువా నేశాను. ఎంతో నియమ నిష్టలతో రోజుకు 10గంటలు మగ్గంనేసి వస్త్రాలను తయారు చేశా. ఈసారి రాజస్థాన్ నూతన డిజైన్‌లతో చీరలను తయారు చేశాను. సాక్ష్యాత్తు శ్రీ లక్ష్మీనర్సింహస్వామికి పట్టు వస్త్రాలను తయారు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– మేకల రామకృష్ణ, చేనేత కళాకారుడు, భూదాన్‌పోచంపల్లి


తయారైన పట్టుచీరను చూపిస్తున్న పద్మశాలి మహాజన సంఘం నాయకులు


సిద్ధమైన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరలు

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5వ తేదీన ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో నిత్యహవనములు, శివ పంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణములు, పంచసూక్త పఠనం గావించారు. మూలమంత్ర జపములు, వివిధ పారాయణములు, మహాపూర్ణాహుతి జరిపించి, కొండపైన విష్ణు పుష్కరిణిలో త్రిశూల తీర్థ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పారాయణీకులచే స్తోత్ర, వేద, నమక, చమక పారాయణములు, మంత్రపుష్ప పఠనములు, సోమకుంభార్చనలు, మూలమంత్ర పారాయణములు జరిపించారు. రాత్రి శివపార్వతుల ఏకాంత శృంగార డోలోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, పూజారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్

- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి
- ఆ పార్టీ నుంచి ఎంపీగా అవకాశం దక్కేనా?


బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న సైదిరెడ్డి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరారు. ఢిల్లీలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె. లక్ష్మణ్ సమక్షంలో ఆదివారం కాషాయం కండువా కప్పుకున్నారు. గతంలో కెనడాలో హోటల్ వ్యాపారం చేసిన సైదిరెడ్డి 2018 ఎన్నికలకు ముందు టీఆర్‌ఎస్‌లో చేరి అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఉత్తమ్ 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా గెలుపొందడంతో హుజూర్‌నగర్‌లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి మళ్లీ సైదిరెడ్డి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డిపై గెలుపొందారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి సైదిరెడ్డి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. కాగా నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తుందన్న ఆలోచనతోనే సైదిరెడ్డి బీజేపీలో చేరినట్లు తెలుస్తోంది. బీజేపీకి కూడా నల్లగొండలో బలమైన నాయకుడు లేకపోవడంతో సైదిరెడ్డిని పోటీలో నిలిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

భువనగిరి క్రైం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. భువనగిరి మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండల పరిధిలోని సూరెపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ధరావత్ రాజేష్, కేతావత్ కుమార్ జిల్లా కేంద్రం నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నాగిరెడ్డిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌లపై ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రియాన్, మైనుద్దీన్‌తో పాటు ధరావత్ రాజేష్, కేతావత్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు.

కారు ఢీకొని..

భువనగిరి పట్టణ కేంద్రానికి చెందిన మహ్మద్ జహంగీర్ ఆదివారం పని నిమిత్తం చందుపట్ల గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైపాస్ మూలమలుపు వద్ద వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు.

బైక్ అదుపుతప్పి..

భువనగిరికి చెందిన సర్వద్, సందీప్‌లు తుక్కాపురంలోని గ్లాస్ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరు బైక్‌పై గ్లాస్ కంపెనీకి వెళ్తుండగా తుక్కాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులందరినీ చికిత్స నిమిత్తం భువనగిరి ఆస్పత్రికి తరలించారు. వీరిలో ధరావత్ రాజేష్, కేతావత్ కుమార్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ముఖ్యమంత్రి రాకకు పటిష్ట ఏర్పాట్లు


హెలిపాడ్‌ను పరిశీలించి పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న విప్ ఐలయ్య, కలెక్టర్ జెండగే

యాదగిరిగుట్ట : సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు, ఆరుగురు మంత్రులతో కలిసి బ్రహ్మోత్సవాలకు రానున్నారు. కల్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. సీఎం రాక నేపథ్యంలో యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. పాతగోశాలలోని యాగ స్థలంలో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. హెలిపాడ్‌ను కలెక్టర్ హనుమంత్ కే జెండగేతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం పరిశీలించారు. హెలిపాడ్ నుంచి కొండపైకి వెళ్లే మార్గాలను పరిశీలించారు. ప్రత్యేక కాన్వాయ్‌తో ట్రయల్ వేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దర్శనాలు బంద్

సీఎం రేవంత్‌రెడ్డి రాక నేపథ్యంలో ఉదయం 8 నుంచి 11గంటల వరకు కొండపైకి వచ్చే వాహనాలతో పాటు భక్తులకు కల్పించే దర్శనాలను నిలిపివేయనున్నట్లు ఈఓ వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు అల్పాహారంగా కట్టెపొంగలి, పులిహోర, దద్దోజనం, లడ్డూలు తయారు చేస్తున్నారు.

స్వాతంత్ర్యానికి ముందు మూడ్రోజులు భక్తోత్సవాలు

- 1955లో యాదగిరిగుట్టలో 11రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


యాదాద్రి ఆలయంలో 1955 తరువాత బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతంత్ర్యానికి పూ ర్వం స్థానికులు మూడ్రోజులు భక్తోత్సవాలు నిర్వహించే వారు. అప్పట్లో కొండ ఎక్కేందుకు మెట్ల సదుపాయం కూడా అంతంత మాత్రమే. అయినా ఈ ప్రాంత వాసులు శ్రీస్వామిని ఆరాధించేందుకు ఎలాగో కొండెక్కేవారట. కొందరు భక్తులు ముందుకు వచ్చి తొలుత మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించారు. అప్పట్లో భక్తులు నిర్వహించవారు కాబట్టి.. వాటిని భక్తోత్సవాలనేవారు. కొన్నేళ్లు గడిచాక ఐదు రోజులకు పెంచారు. అప్పట్లోనే హైదరాబాద్, మహబూబ్‌నగర్, మహారాష్ట్ర, వరంగల్ వంటి ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా ఈ క్షేత్రానికి వచ్చేవారని పలువురు చెబుతుంటారు. కాలక్రమేణ శ్రీనారసింహుడిపై భక్తి పెరిగి ఉత్సవాలకు మార్గమేర్పడిందని చెబుతుంటారు. కీకారణ్యం, వసతులు లేని కాలంలో (సుమారు 1895) ప్రాంతంలో ఆ ఉత్సవాలు జరిగాయి. మార్గశిర మాసంలో ఆ సంబురాలు జరిగేవి. ఆ కాలంలో శ్రీస్వామి ఉత్సవాలు జరపడం సబబుకాదంటూ అప్పట్లోనే పూజారులు కొందరు పాల్గుణ మాసంలో 11 రోజుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యాక అప్పటి ఆలయ కమిటీ పెద్దలు ఆచార్యులతో సంప్రదించి 1955లో 11 రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి శ్రీస్వామి బ్రహ్మోత్సవాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

సినిమా కథను తలపించిన నిర్మాత మృతి

- బతికుండగానే చనిపోయినట్లు మిర్యాలగూడలో ఫ్లెక్సీల ఏర్పాటు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరునటి రోజు రాంబాబు మృతి
- ముగిసిన అంత్యక్రియలు


పాలిశెట్టి రాంబాబు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : పలు తెలుగు చిత్రాలను రూపొందించిన సినీ నిర్మాత పాలిశెట్టి రాంబాబు(58) మృతి చివరకు ఓ సినిమా కథను తలపించింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాలిశెట్టి రాంబాబు మొదట ప్రజా నాట్యమండలి కళాకారుడిగా పనిచేశారు. ఆ తరువాత హైదరాబాద్‌కు చేరుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రాణించి సినీ నిర్మాతగా మారారు. అతడికి భార్య సంధ్యారాణి, ఇద్దరు కుమార్తెలున్నారు. తెలుగులో హీరో అల్లరి నరేష్‌తో గోపి గోడమీది పిల్లి, లక్ష్మీపుత్రుడు సినిమాలను నిర్మించారు. అయితే, కొంత కాలంగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. ఐదురోజుల పాటు చికిత్స పొందినా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అమెరికాలో ఉంటున్న ఆయన కుమార్తె గత శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకుంది. అదేరోజు మధ్యాహ్నం 3గంటల తరువాత వెంటిలెటర్ తొలగించారు. గంటల వ్యవధిలో రాంబాబు మరణిస్తారని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. విషయం బంధువులు, మిర్యాలగూడలో ఉన్న స్నేహితులకు తెలియడంతో ఆయన శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్లు ప్రకటించి.. అదే రోజు రాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న రాంబాబును శుక్రవారం రాత్రి మిర్యాలగూడకు తీసుకవచ్చి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. బతికే ఉన్నాడని సమాచారంతో శనివారం తెల్లవారుజామున పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. అయితే, శనివారం రాత్రి 8గంటల సమయంలో ఆయన తుది శ్వాస విడిచారు. శనివారం పట్టణంలో ఈ విషయంపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పలువురి సంతాపం

సినీ నిర్మాత పాలిశెట్టి రాంబాబు మృతదేహానికి దివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసంహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కాసుల సత్యం, వీరాచారితో సహా పలువురు నివాళులు అర్పించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆయన నివాసానికి జనం భారీగా తరలి వచ్చారు. ఆయన మృతదేహానికి పెద్ద కుమార్తె అంజు చేతుల మీదుగా సాంప్రదాయ ప్రకారం హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

భీమలింగం కాల్వలో పడి వ్యక్తి మృతి

- మృతుడి స్వస్థలం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం

వలిగొండ: మండలంలోని సంగం గ్రామ పరిధిలోని భీమలింగం కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి (64) తల్లి ఇటీవల చనిపోయింది. ఆమె అస్థికలు కలిపేందుకు భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం సాయంత్రం వలిగొండ మండల పరిధిలోని సంగం గ్రామానికి వచ్చారు. అక్కడ భీమలింగం కాల్వలో అస్థికలు కలిపారు. తిరుగు ప్రయాణంలో భూపాల్‌రెడ్డి భీమలింగం కాల్వ కత్వా మీద నుంచి జారి నీటిలో కొట్టుకుపోయాడు. భూపాల్‌రెడ్డి ఎంతకీ రాకపోవడంతో కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. కొద్ది దూరంలో భూపాల్‌రెడ్డి కనిపించగా వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

- స్వామివారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు


ఆలయ మాడవీధిలో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: వరుస సెలవులు రావడంతో ఆదివారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా రావడంతో ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్ వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. నిత్యాదాయం రూ.43,26,133 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న కులశేఖరాళ్వార్ వంశస్తురాలు..


కులశేఖరాళ్వార్ విగ్రహం వద్ద తిరునాళ్ లక్ష్మీబాయి

యాదాద్రీశుని అనంత పద్మనాభస్వామి ఆలయ వంశపారంపర్య చైర్మన్, కులశేఖరాళ్వార్ వంశస్తురాలు, ట్రావెన్‌కోర్ రాజ కుటుంబానికి చెందిన అశ్వతి తిరునాళ్ లక్ష్మీబాయి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలో కులశేఖరాళ్వార్ కృష్ణశిల విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చింతపల్లి: పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయాన్ని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం చింతపల్లి మండల కేంద్రంలో 2 కిలోమీటర్ల మేర హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి, మంత్రులందరూ కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ప్రాజెక్టులను మూడు సంవత్సరాలలో పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో ప్రతి తండా, గ్రామానికి రోడ్లు వేయించే బాధ్యత తనేదనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, డీసీసీ ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, ఎరుకలి వెంకటయ్యగౌడ్, గడ్డం పురుషోత్తంరెడ్డి, ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, జితేందర్‌రెడ్డి, గుండ్లపల్లి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు


రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇప్పించి చేయూతనిస్తాం..

కొండమల్లేపల్లి: చింతపల్లి మండలంలో ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని దేవరకొండకు వస్తూ కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. కొండమల్లేపల్లిలోని ఓ ప్రైవేట్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో ఆర్‌ఎంపీ వద్ద మంత్రి బీపీ చెక్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్‌ఎంపీలను నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి చేయూత అందిస్తుందని తెలిపారు. కాగా తన చిన్నతనంలో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దనే చికిత్స చేయించుకునేవాడినని గుర్తుచేసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీపీ రేఖారెడ్డి కొండమల్లేపల్లి మండల అభివృద్ధికి, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి వెంట దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంఏ సిరాజ్‌ఖాన్, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి: ఆర్‌ఎంపీ వద్ద బీపీ చెక్ చేయించుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి